క్లుప్తంగా

అట్టడుగు జాతి బిడ్డలను గౌరవించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రప్ప

కర్నూలు(అర్బన్): అట్టడుగు వర్గాల నుంచి ఉన్నత స్థాయికి చేరుకునే వారిని గౌరవించుకోవడం అందరి బాధ్యత అని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడిగా సామాన్య ఎరుకలి సామాజిక వర్గానికి చెందిన వెంకటపతి ఎంపిక అభినందనీయమన్నారు. నగర శివారుల్లోని గిరిజన భవన్‌లో ఈనెల 24వ తేదీన నిర్వహించే వెంకటపతి సన్మాన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. సమావేశంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరాజు, పీ వెంకటేష్, ఎరుకుల సంఘం నాయకులు కరివేపాకు రామకృష్ణ, రామాంజనేయులు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి



శిబిరంలో మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ మీనిగ శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మీనిగ శ్రీనివాసులు అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్ఆర్ పేటలోని తుంగభద్ర హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి షుగర్, బీపీ, ఈసీజీ, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు.

నిజాయితీకి నిలువుటద్దం కోట్ల



కోట్ల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి నీతి, నిజాయితీకి నిలువుటద్దమని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు అన్నారు. శనివా రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కోట్ల విజయభాస్కరరెడ్డి 105వ జయంతి వేడుకలను నిర్వహించారు. కోట్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కోట్ల విగ్రహం వరకు ర్యాలీ గా వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కోట్ల విజయభాస్కర రెడ్డి విలువలతో కూడిన రాజకీయాలు చేసి ప్రజల మనసులో స్థిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ ప్రధానకార్యదర్శి దామోదరంరాధాకృష్ణ, నాయకులు సయ్యద్‌ఖాద్రిపాషా, బజారన్న, బతుకన్న, షేక్ ఖాజా హుస్సేన్, అమన్, లాజరస్ పాల్గొన్నారు.

హోరాహోరీగా..



గిరక బండి పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: కృష్ణాష్టమిని పురస్కరించుకొని కోడుమూరు పట్టణంలో యాదవ సంఘం సభ్యులు గిరకబండి లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 10 జతల వృషభాలు పోటీ పడగా, బంటు పల్లె అశోక్ వృషభాలు మొదటి స్థానంలో గెలుపొందాయి. అలాగే బాల మద్దిలేటి, చాకలి లింగన్న, గొల్ల జైలు అనే రైతులకు చెందిన వృషభాలు 2,3,4 వ స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరసగా రూ.10,016లు, రూ.7,016, రూ.5016, రూ.3,016 నగదు బహుమతులు అందజేశారు. అలాగే ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.2,016, రూ.1,516, రూ.1,016, రూ.516 చొప్పున అందజేశారు.

సాక్షి సినిమాలు



ఎస్వీసీ కాంప్లెక్స్ : కూలీ, వార్ 2 , , మహావతార్ నరసింహ
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : కూలీ, వార్ 2 ,మహావతార్ నరసింహ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వార్ 2, మహావతార్ నరసింహ, కూలీ
శ్రీరామ : కూలీ
రాజ్ : వార్ 2
భరత్ కాంప్లెక్స్ : సర్ మేడమ్, కూలీ
విజయ: వార్ 2
విక్టరీ : హరిహర వీరమల్లు



గాయత్రీ గోశాలలో ప్రత్యేక అలంకారంలో శ్రీకృష్ణుడు



ఇస్కాన్ టెంపుల్‌లో..



సత్యసాయి మందిరంలో చిన్న కృష్ణుల వేషధారణలో చిన్నారులు



లలితా పీఠంలో ఉట్టి కొట్టే వేడుకలో పాల్గొన్న భక్తులు

జయజనార్దనా..జన్మ మోచనా!



చిన్మయ మిషన్‌లో చిన్న కృష్ణుడు



రుక్మిణీ సమేత శ్రీకృష్ణ ఆలయంలో లాలిపాట పూజలో భక్తులు



ఊరేగింపులో కళాకారుల చెక్క భజన

- అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- ఆకట్టుకున్న చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలు
- ఇస్కాన్‌లో మహా శంఖాభిషేకం
- ప్రత్యేక ఆకర్షణగా శ్రీకృష్ణుని చిత్రపట శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరిగాయి. జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల ఆలయాల్లో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. గోమాత పూజ, ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్ని కృష్ణులు, గోపికల చిలిపి చేష్టలు, నృత్యాలు అలరించాయి. ఇస్కాన్‌లో జరిగిన వేడుకల్లో నగర మేయర్ బీవై రామయ్య, జేసీ నవ్య, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొని పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిచ్చారు. కర్నూలు నగరంలో గో సంరక్షణ శాల, బీక్యాంప్ విజ్ఞాన మందిరం, లలితా పీఠం, చిన్న అమ్మవారి శాల, రామిరెడ్డి తాత సంస్థాన్, సత్యసాయి మందిరం, దక్షిణ షిరిడీ సాయిబాబా ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయం, భరతమాత ఆలయం, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.



గోశాలలో ఉట్టి కొడుతున్న భక్తులు

- ఇస్కాన్ జగన్నాథ మందిరంలో గోకులాష్టమి వేడుకలు వైభవంగా చేపట్టారు. శ్రీరాధా గోవిందులకు మహా శంఖాభిషేకం, 108 ఆహార పదార్థాలతో రాజభోగ నివేదన కార్యక్రమాలు జరిగాయి. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిచ్చారు.

భరత మాత మాతృ మండలి ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భరత మాత మాతృ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు అంబరాన్నంటాయి. విద్యార్థులకు నృత్య పోటీలు, బాలగోకులం, చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణ పోటీలు నిర్వహించారు. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, రాజ్యలక్ష్మి దంపతులు వేడుకల్లో పాల్గొన్నారు. గోపికలు, చిన్ని కృష్ణుల వేషధారణ చిన్నారులతో కలిసి ఉట్టి కొట్టారు. పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మండలి అధ్యక్షురాలు పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలి సభ్యులు జయలక్ష్మి, స్వప్న, రజనీ కల్కూర, హేమలత, అనురాధ, మహాలక్ష్మి, శ్రీదేవి, కృష్ణవేణి, జగన్నాథ గట్టు అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





నృత్య ప్రదర్శనలో చిన్నారులు, హాజరైన ప్రజలు

- నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని రుక్మిణీ సమేత శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మదిన వేడుకలు, లాలి పాటలు, ఉట్లోత్సవం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి శ్రీకృష్ణ మందిరం వరకు శ్రీకృష్ణుని చిత్రం పటంతో ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయం ఆవరణలో జరిగిన సమావేశంలో యాదవ సంఘం పెద్దలు మాట్లాడుతూ.. యాదవులు అందరూ ఐక్యంగా ఉండి యాదవుల శక్తిని చాటాలన్నారు. యాదవ సంఘం ప్రముఖులు డాక్టర్ మాల మద్దయ్య యాదవ్, లక్కీటూ రాంపుల్లయ్య యాదవ్, నాగేశ్వరరావు యాదవ్, డాక్టర్ హరికిషన్, అయ్యన్న యాదవ్, శ్రీరాములు, నాగరాజు పాల్గొన్నారు.
- చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళి భవన్‌లో చిన్నారులకు చిన్ని కృష్ణుల పోటీలు నిర్వహించారు. మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సందేశమిచ్చారు. కార్యక్రమంలో మిషన్ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, సభ్యులు గురవయ్య శెట్టి, రత్న ప్రసాద్, ఆపోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి తిలకధారణ

ఘనంగా వీహెచ్‌పీ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న అనంత విశ్వ ప్రసాద్

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం హరిశ్చంద్ర శరీన్ నగర్‌లోని అభయాంజనేయ స్వామి ప్రఖండలోని సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో ఈ వేడుకలు జరిగాయి. వీహెచ్‌పీ ధర్మ ప్రసార్ రాష్ట్ర కన్వీనర్ అనంత విశ్వ ప్రసాద్ హాజరై మాట్లాడారు. వీహెచ్‌పీ 60 ఏళ్ల ప్రస్థానంలో 125 దేశాల్లో విస్తరించి 65 లక్షల మంది కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్తులో మరింత సేవలు విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర మీడియా కన్వీనర్ భానుప్రకాష్, మాతృశక్తి విభాగ్ కన్వీనర్ పావని, నాయకులు సంగు రామ్, ప్రవీన్, అశ్విని, పూజిత, వనజ, హారిక, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో విప్లవాత్మక మార్పులు


కర్నూలుకల్చరల్: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)తో విప్లవాత్మక మార్పులు సాధ్యమని సియంట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం కర్నూలు ట్రిపుల్‌ఐటీడీఎమ్‌లో నిర్వహించిన సదస్సులో సియంట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డితో ఇంటరాక్టివ్ సెషన్ చేపట్టారు. డిజైన్, తయారీలో కృత్రిమ మేదస్సు, పారిశ్రామిక పునరుజ్జీవనం, నైపుణ్యాలు, అనుకూలత ఎలా ముఖ్యమైనది, వ్యవస్థాపకత, స్టార్టప్‌లు పరిశ్రమలను ఎలా పునర్నిస్తున్నాయో.. మోహన్ రెడ్డి వివరించారు. మానవ జీవితాన్ని విప్లవాత్మకంగా మార్చగల సామర్థ్యంలో ఏఐ ప్రముఖ పాత్ర పోషింస్తుందన్నారు. ఏఐ ఉద్యోగాలను తీసివేయదని, మానవ సామర్థ్యాలను పెంచుతుందన్నారు. ప్రొఫెసర్ నరేష్ బాబు, అసోసియేట్ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ పాల్గొన్నారు.



బీటెక్ విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న మోహన్‌రెడ్డి

రజకులపై దాడులను అడ్డుకోవాలి

కర్నూలు(సెంట్రల్): రజకులపై జరుగుతున్న దాడులను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక రక్షణ చట్టం తేవాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశా రు. శనివారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ..ఎన్నికల్లో రజకులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రజక కుటుంబాలకు 200 యూనిట్ల కరెంట్‌ను ఉచితంగా ఇవ్వాలన్నారు. రజక ఫెడరే షన్ ద్వారా ఉచితంగా రుణాలు ఇప్పించాలన్నారు. రజక యువత కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో దోబీలను ఏర్పాటు చేయాలని కోరారు. రజకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 25వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎల్లయ్య, శేషాద్రి, రాముడు, రమణ, రేణుక, అంజి, శేఖర్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

ఘనంగా విలియం కేరి జయంతి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రవికుమార్

కర్నూలు (టౌన్): నగరంలోని కిడ్స్ వరల్డ్ సమావేశ భవనంలో జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం విలియం కేరీ 264వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బైబిల్ మిషన్ పరిపాలన అధికారి బందెల రాజు, జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బైబిల్ అనువాదం, విద్య, సామాజిక సంస్కరణలలో విలియం కేరి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత సుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలతా రెడ్డి, మన్సూర్ అలీ ఖాన్, పాస్టర్లు రాజేష్, క్రిష్టఫర్, సుధీర్ కుమార్, ప్రసాదరావు, మద్దిలేటి పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా లిఫ్టర్లు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధి కారి భూపతిరావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటున్న శ్రావణి, అనిత, లక్ష్మీ, ప్రణీత (బాలికల విభాగం) అలాగే లోకేష్, కౌశిక్, ఆరిఫ్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ నిర్వహణ కార్యదర్శి వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శి రేష్మా, ఉపాధ్యక్షులు ముసామియా పాల్గొన్నారు.

నేడు తెలుగు కథపై సదస్సు

కర్నూలు కల్చరల్: సాహిత్య అకాడమీ, సాహితీ స్రవంతి సంయుక్తంగా నిర్వహిస్తున్న 75 సంవత్సరాలు (1947–2022) తెలుగు చిన్న కథలు అన్న అంశంపై ఆదివారం ఉదయం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, చక్రపాణి యాదవ్ తెలిపారు. సదస్సును రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ ప్రారంభిస్తారన్నారు.

జగనన్న కాలనీలో పంటల సాగు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 400 ఎకరాల్లో 27,797 మందికి పట్టాలు



పి.రుద్రవరంలో జగనన్న కాలనీలో సాగు చేసిన మొక్కజొన్న పంట, చిత్రంలో ప్లాటును సూచించే సర్వే రాయి

కర్నూలు(రూరల్): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాల పంపిణీ పెద్ద ఎత్తున చేపట్టారు. అరకొరగా కాకుండా కొత్త ఊళ్లనే నిర్మించేందుకు సిద్ధమయ్యారు. కులమతాలకు అతీతంగా, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాన్ని అందించేందుకు జగనన్న కాలనీలను తీర్చిదిద్దారు. అందులో భాగంగానే కర్నూలు మండల పరిధిలోని పి.రుద్రవరంలో 400 ఎకరాల్లో జగనన్న కాలనీ ఏర్పాటైంది. భూములను కోల్పోయిన రైతులకు సుమారు రూ.68 కోట్లు పరిహారంగా అందజేశారు. కర్నూలు అర్బన్ ప్రాంతాలకు చెందిన సొంతింటి స్థలం లేని వారికి లేఅవుట్ వేసి సకల సౌకర్యాలు కల్పించారు. భూమిని చదును చేయడంతో పాటు తాత్కాలిక రోడ్లు నిర్మించి.. బోర్లు, కుళాయిలు ఏర్పాటు చేశారు. విద్యుత్ సౌకర్యాన్ని సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడ మొత్తం 27,797 మందికి పట్టాలు పంపిణీ చేశారు.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. అధికారులు కూడా ఆ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు కొనసాగించకపోవడంతో ఇళ్లు నిర్మించుకోవాలనుకున్న లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. ఇదే సమయంలో సమీప గ్రామాల రైతులు జగనన్న కాలనీలో పంటల సాగుకు సిద్ధమయ్యారు. పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో నెంబర్ రాళ్లు.. గ్రావెల్ రోడ్డును ధ్వంసం చేశారు. యథేచ్ఛగా పంటలు సాగు చేస్తున్నారు. సుమారు 40 ఎకరాల్లో పి.రుద్రవరం, శివరామపురం గ్రామాల రైతులు గత సంవత్సర కాలంగా మొక్కజొన్న, టమాట, ఉల్లి, కూరగాయల పంటలను సాగు చేస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. ఈ కారణంగా జగనన్న కాలనీ రూపు కోల్పోతుంది. ఎంతో ఉన్నతాశయంతో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించాల్సింది పోయి నిరుపేదల ఆశలను గాలికొదిలేయడం విమర్శలకు తావిస్తోంది.



పాట్ల నెంబర్లను సూచించే రాళ్లను తొలగించి ఓ మూలకు చేర్చిన దృశ్యం

సాగు చేయవద్దని దండోరా వేయించాం



జగనన్న కాలనీలో పేదలకు కేటాయించిన స్థలాలను పంట పొలాలుగా మార్చి సాగు చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే గ్రామంలో దండోరా వేయించి సాగు చేసుకోవద్దని చెప్పాం. భూములు సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవు. – టి.వి.రమేష్ బాబు, కర్నూలు రూరల్ తహసీల్దార్

మార్కెట్ అభివృద్ధికి అన్ని విధాలా సహకారం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డును అన్ని విధాలా అభివృద్ధి చే యడంతో పాటు రైతుల అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం కర్నూలు వ్యవసాయ మా ర్కెట్ యార్డ్‌లో నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై ప్రసంగించారు. మార్కెట్ కమిటీకి గౌరవ చైర్మన్‌గా కర్నూలు ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ వ్యవహరిస్తారు. చైర్మన్‌గా గోల్కొండ అబ్బుత్‌బీ, వైస్ చైర్మన్‌గా కే.శేషగిరిశెట్టితో పాటు 15 మంది పాలక వర్గం సభ్యులతో మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్నూలు మార్కెట్‌ను రాష్ట్రానికే మోడల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి

కర్నూలు(సెంట్రల్): స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అణగారిన వర్గాల కోసం చేసిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. శనివారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాటంలో కీలకంగా వ్యవహరించిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఏటా అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీకాకుళం జిల్లా బారువలో పేద కల్లుగీత కార్మిక కుటుంబంలో జన్మించిన ఆయన స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. ఆయన పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి ప్రసూన, గౌడ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ కాసాని మహేష్‌గౌడ్ నాయకులు రవిశంకర్‌గౌడ్, రాజశేఖరగౌడ్, శ్రీనివాసగౌడ్, సంతోష్ గౌడ్, శేఖర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, బీసీ సంఘం నాయకులు రాంబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.



గౌతులచ్చన్న చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, గౌడ కుల సంఘం నాయకులు

పోలీసు శాఖలో కర్తవ్య నిబద్ధత ముఖ్యం

- ఫోర్త్ టౌన్ సీఐ విక్రమసింహ

కర్నూలు: పోలీసు శాఖలో కర్తవ్య నిబద్ధత ముఖ్యమని నాల్గవ పట్టణ సీఐ విక్రమసింహ అన్నారు. గుర్తు తెలియని మృతదేహాలకు గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు నిర్వహించి ఆదర్శంగా నిలిచి పంద్రాగస్టు సందర్భంగా మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ హసన్ అహ్మద్‌ను శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ, సహోద్యోగులతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హసన్ అహ్మద్ కర్తవ్యాన్ని నిబద్ధతతో పాటు మానవత్వంతో కూడిన సేవలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. మరణ పరిశీలన (ఇన్‌క్వెస్ట్) సమయంలో విచారణ అధికారికి సమగ్ర సహకారం అందించడం, అలాగే గుర్తు తెలియని మృతదేహాలను చట్టపరమైన విధానాల ప్రకారం గౌరవప్రదంగా నిర్వహించడం వంటి సేవలతో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ కిషోర్ రెడ్డితో పాటు సహోద్యోగులు పాల్గొని హసన్‌ను సత్కరించారు.



నాల్గవ పట్టణ హెడ్ కానిస్టేబుల్ హసన్‌ను సత్కరిస్తున్న సీఐ విక్రమసింహ